# 1. విశాల భారతదేశం

పద్యభాగం

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

జతపరచండి.

| | |
|---|---|
| 1. అమరవీరుల సంస్మరణదినం | ఆగస్టు 15 |
| 2. కార్మిక దినోత్సవం | జనవరి 30 |
| 3. గణతంత్ర దినోత్సవం | మే 1 |
| 4. స్వాతంత్ర్య దినోత్సవం | జనవరి 26 |

- మీకు తెలిసిన దేశభక్తి గేయాలు ఏవి?
- మీకు నచ్చిన దేశభక్తి గేయాన్ని పాడండి.

చిత్ర వర్ణాల, భాషాసంస్కృతుల అందమైన రంగవల్లి మన భారతదేశం. అట్టి దేశంలో మనం ఎలా మెలగాలో తెలుసుకుందామా!

విశాల భారతదేశం మనది
హిమాలయాలకు నిలయమిది
ఇలాంటి దేశంలో ప్రజలంతా
విశాల హృదయంతో మెలగాలి ||విశాల|| 1

మతాలు వేరయితేనేమి
భాషలు వేరయితేనేమి
భారతీయులం అందరం
భారతదేశం సుందరం ||విశాల|| 2

ద్వేషం, రోషం తొలగాలి
ప్రేమ, స్నేహం వెలగాలి
బుద్ధ గాంధీల బోధనలే
తొలగించును మనవేదనలే ||విశాల|| 3

ప్రేమపతాకం చేబూని
ఐక్యపథంపై పయనిద్దాం
త్యాగశక్తి మన మహాయుధంగా
దేశశత్రువుల నెదిరిద్దాం ||విశాల|| 4



## I. వినండి-సంభాషించండి.

1. మన జాతీయ పతాకంలోని రంగులు, అశోకచక్రం దేనికి ప్రతీకలు- చర్చించండి.
2. మన జాతీయ గీతం యొక్క అర్థాన్ని అంతర్జాలంలో చదివి తెలుసుకోండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. పదజాలం పెంపొందించుకుందాం.

నిలయం = ఇల్లు; మెలగాలి = నడుచుకోవాలి; ద్వేషం = పగ, రోషం = కోపం; వేదన = బాధ; పతాకం = జెండా;

### ఆ. భావాలు:

1. విశాల భారతదేశం మనది. హిమాలయ పర్వతాలకు నిలయమైనది. ఇలాంటి దేశంలో ప్రజలంతా విశాల హృదయంతో నడుచుకొనవలయును.

2. మనదేశంలో వివిధ మతాలు, వివిధ భాషలు ఉన్నప్పటికి మనమంతా భారతీయులం. భారతదేశం సుందరమైనది.

3. భారతదేశంలోని ప్రజలంతా పగ, కోపములను తొలగించుకొని ప్రేమ, స్నేహములతో ప్రవర్తించవలయును. గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ గారి బోధనలే మన బాధలను తొలగించును.

4. దేశంలోని ప్రజలంతా ప్రేమ అనెడి పతాకాన్ని చేపట్టి ఒకే మార్గంపై ప్రయాణించవలయును. త్యాగశక్తి అను మహాయుధంతో దేశమునందలి శత్రువులను ఎదుర్కొనవలెను.

### ఇ. చర్చించండి-రాయండి:

1. భారతదేశం గురించి రాయుము.
2. భారతీయులు ఎలా మెలగాలో వివరింపుము.

### ఈ. గ్రహించిన దానిని పరీక్షించుకోండి. సరియైన పర్యాయానికి వలయం చుట్టండి.

1. ఈ పాఠం
   - ఒక గద్యం
   - ఒక పద్యం
   - ఒక గేయం

2. ఈ గేయం
   - ఒక హాస్య గేయం
   - ఒక విప్లవ గేయం
   - ఒక దేశభక్తి గేయం

3. గేయం ఇచ్చిన సందేశం
   - ఐక్యతతో మెలగాలి
   - బాగా చదవాలి

### ఉ. నీ స్నేహితుడు/స్నేహితురాలిని గేయాన్ని చదవమనండి. వానిని వింటూ గేయంలో ఇచ్చిన సలహాకు మాత్రమే '✓' గుర్తు పెట్టండి.

1. మన దేశవాసులు విశాల హృదయంతో మెలగాలి. ☐
2. ఐక్యమార్గంలో పయనించాలి. ☐
3. కోపాలు, ద్వేషాలు వదలకూడదు. ☐
4. త్యాగమనే గొప్ప ఆయుధంతో దేశం కోసం పోరాడాలి. ☐
5. ఎన్ని భాషలు, మతాలు ఉన్నా మనమందరం భారతీయులం. ☐

**III. కృత్యం:**

**పాఠ్య భాగంలోని కింది గేయ చరణాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**అ. కింది ఖాళీలను అర్థవంతమైన పదములతో పూరించి, వాక్యములను తిరిగి రాయండి.**

1. ఇవి తొలగాలి

[ ] [ ]

2. వీరి బోధనలు మన వేదనలు తొలగించును

[ ] [ ]

పాఠ్యభాగంలోని 1 నుండి 3 చరణాలు




**ఆ. కింది పదములకు వాచకాలు రాయండి.**

1) హిమాలయాలు = [ ]   2) గాంధీ = [ ]

**ఇ. స్వీయస్పందన : భారతదేశ ఔన్నత్యమును గురించి సొంత మాటల్లో రాయండి.**

## IV. భాషావగాహన

### విభక్తులు

ఉపా : విద్యార్థులారా! కిందటి తరగతిలో విభక్తులు – ప్రత్యయాలు నేర్చుకున్నారు కదా! వాటిని మరోసారి మననం చేసుకోండి.

| | ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|---|
| 1. | డు, ము, వు, లు | ప్రథమా విభక్తి |
| 2. | నిన్, నున్, లన్, కూర్చి, గురించి | ద్వితీయా విభక్తి |
| 3. | చేతన్, చేన్, తోడన్, తోన్ | తృతీయా విభక్తి |
| 4. | కొఱకున్, కై | చతుర్థీ విభక్తి |
| 5. | వలనన్, కంటెన్, పట్టి | పంచమీ విభక్తి |
| 6. | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ | షష్ఠీ విభక్తి |
| 7. | అందున్, నన్ | సప్తమీ విభక్తి |
| 8. | ఓ, ఓయి, ఓరి, ఓసి | సంభోధన ప్రథమా విభక్తి |

అ. **ఇప్పుడు కింది వాక్యాల్లోని విభక్తి ప్రత్యయాలను గుర్తించి పట్టికలో రాయండి.**

| | ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|---|
| 1. | హిమాలయాలకు నిలయమిది | |
| 2. | విశాల హృదయంతో మెలగాలి | |
| 3. | దేశ శత్రువులను ఎదిరిద్దాం | |

**ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించి రాయండి.**

<u>దేశంలో</u> ప్రజలంతా <u>విశాల</u> హృదయంతో <u>మెలగాలి.</u>

దేశం = [ ]   విశాల = [ ]   మెలగాలి = [ ]

**ఉపాధ్యాయులకు సూచన:** ఇలాంటి మరికొన్ని దేశభక్తి గేయాలను విద్యార్థులచే లయబద్ధంగా పాడించండి.

**V. సృజనాత్మకత**


**అ. దిగువనిచ్చిన సూచనను అనుసరించి గడినుడిని పూరించండి.**

**నిలువు**

1. మన దేశం ___________

**అడ్డం**

1. మనమందరం ___________
2. వీరిని ఎదిరిద్దాం ___________




**భాషా కౌశల్యాలు (మౌఖికం) – ఉక్త లేఖనం**

**నియమాలు:**

- శ్రద్ధగా అవగాహనతో విని రాయవలెను.
- శుభ్రంగా, గుండ్రంగా, విరామచిహ్నాలు పాటిస్తూ రాయవలెను.
- తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయవలెను

**1. హిమాలయాలు 2. భారతీయులు 3. ఐక్యపథం 4. హృదయం**



**లేఖననైపుణ్యాలు – నివేదిక**

**నివేదిక అనగా ఒక సంఘటన లేదా కార్యక్రమం జరిగిన విధానాన్ని సంక్షిప్తంగా తెలియజేస్తూ రాయటం.**

**సూచనలు :** 1) దీనిని ఒక పరిచ్ఛేదంగా మాత్రమే రాయాలి.

2) సంఘటన లేదా కార్యక్రమం జరిగిన తేదీ, రోజు, సంవత్సరం, జరిగిన ప్రదేశం తప్పనిసరిగా ముందు రాయాలి.

3) ఎవరెవరు హాజరయ్యారు, ఏవిధంగా జరిగింది అనే అంశాలు క్రమంగా రాయాలి.

ఇప్పుడు అంశాల ఆధారంగా బాలల దినోత్సవం గురించి నివేదికను ఎలా రాయాలో చూద్దామా!

**అంశాలు :**

**తేది : 14-11-2017**

**వేదిక : జిల్లాపరిషత్ తెలుగు పాఠశాల, నకోడ, చంద్రపూర్.**

**ముఖ్య అతిథి : గౌ॥ చంద్రశేఖర్ (జిల్లాధికారి)**

**కార్యక్రమ వివరాలు :**
- **వివిధ పోటీలు**
- **బహుమతి ప్రదానం**
- **నాటిక ప్రదర్శన**
- **ముఖ్య అతిథి ప్రసంగం**
- **వందన సమర్పణ**



- నివేదిక

ఈ సంవత్సరం నవంబరు 14వ తేదీన ఉదయం 8 గంటలకు నకోడ, జిల్లాపరిషత్ తెలుగు పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవం జరుపబడింది. ఆ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు పెంచిన గులాబీల పోటీలు, ఏక పాత్రాభినయం, చిత్రకళ పోటీలు నిర్వహించారు. ప్రతి తరగతిలోను విద్యార్థులు గీసిన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు అందరం వేదిక దగ్గర సమావేశమయ్యాము. వివిధ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులందరికి ముఖ్య అతిథి చేత బహుమతి ప్రదానం జరిగింది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించిన **బంగారు బాల్యం** నాటిక ప్రదర్శింపబడింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లాధికారి శ్రీ చంద్రశేఖర్ గారు **'నేటి బాలలే రేపటి పౌరులు'** అను అంశంపై ఔత్సాహిక ఉపన్యాసం ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుని వందన సమర్పణతో సభ ముగిసింది.

**అభ్యాసం:-**

మీ తాలూకాలో జరుపుకున్న సైన్సు ఎగ్జిబిషన్ గురించి ఆదర్శ విద్యార్థి పత్రికకు నివేదిక రాయండి.

**అంశాలు :**

సైన్స్ ఎగ్జిబిషన్ – జరిగిన తేది
- వేదిక
- ప్రదర్శించిన వివిధ వైజ్ఞానిక ప్రయోగాలు
- అందులో చాలా బాగున్నది.
- విచ్చేసిన ముఖ్య అతిథి
- బహుమతి ప్రదానం
- ముఖ్య అతిథి ఉపన్యాసం
- వందన సమర్పణ

NN2JEZ

## భాషా కౌశల్యాలు (మౌఖికం) – సంభాషణ

**ఆసక్తికరంగా సంభాషించడం అతి ముఖ్యమైన జీవన కౌశల్యం. మనం జీవితంలో చాలా సమయం మాట్లాడటానికి కేటాయిస్తాం. కాబట్టి చక్కగా సంభాషించడం నేర్చుకోవడం ఎంతేని ఆవశ్యకం.**

**నియమాలు :**



* సంభాషిస్తున్న విషయం లేదా అంశం నుండి వైదొలగ (Deviate) రాదు. సూటిగా మాట్లాడాలి.
* అనవసరమైన వివరాలు ప్రస్తావించరాదు
* ఎదుటివారికి అవకాశమివ్వాలి.
* స్పష్టంగా, నిదానంగా మాట్లాడాలి.
* తగిన శారీరక భాష (Body Language) పట్ల శ్రద్ధ వహించాలి.

**ఇప్పుడు కింది విషయాలను, అంశాలను గురించి చర్చించండి/సంభాషించండి.**

భారతదేశం వ్యవసాయ ప్రధానదేశం. ఆనాడే వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన లాల్‌బహదూర్ శాస్త్రిగారు **"జై జవాన్–జై కిసాన్"** అని నినదించారు. సైనికులు, రైతులు దేశానికి వెన్నెముకవంటి వారు. వారి వలననే మనం కడుపునిండా ఆహారం తిని కంటినిండా నిద్రపోతున్నాం. ఒకరు **అన్నదాత**, మరొకరు **ప్రాణదాత**.

- **మీరెప్పుడైనా వ్యవసాయం ఎలా చేస్తారో చూశారా?**
- **ఎక్కడెక్కడ చూశారు?**
- **వ్యవసాయానికి వాడే పనిముట్లను కింది చిత్రాల ద్వారా తెలుసుకోండి. వాటిని ఏయే వ్యవసాయ పనులకు ఉపయోగిస్తారో, ఉపాధ్యాయులతో చర్చించి. తెలుసుకోండి. తరగతి మిత్రులతో సంభాషించండి.**

